నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జక్కుల ఆశన్న తల్లి జక్కుల గంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శనివారం బాధిత కుటుంబాన్ని మాజీ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి చంటి, తాంసి జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, మండల సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కనపర్తి చంద్రకాంత్, సుంకిడి మాజీ సర్పంచ్ గెల్లా మహేందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ టు కార్పొరేట్ అంశంపై శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రిన్సిపల్ డా. జలగం అనిత సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ఆవరణలో శనివారం టాస్క్ ద్వారా కోకో కోల కంపెనీ నుంచి ట్రైనర్ అబ్దుల్ ముఖిత్ శిక్షణ అందించారు. కార్పొరేట్‌లో ఎలా వ్యవహరించాలి, ఇంటర్వ్యూకి ఎలా వెళ్లాలో పలు విషయాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కోఆర్డినేటర్ కోటయ్య, చైతన్య కృష్ణ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపీకి పోటాపోటీ..!

- ఆదిలాబాద్ లోక్‌సభ సీటుపై అమితాసక్తి
- ప్రధాన పార్టీల నుంచి అనేక మంది ఆశావహులు
- టికెట్ కేటాయించాలని పార్టీ అధిష్టానాలకు విజ్ఞప్తి
- ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, పర్యటనలతో విస్తృతంగా ప్రజల్లోకి

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం హాట్ సీటుగా మారుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ స్థానంలో పోటీ చేసేందుకు అనేక మంది అమితాసక్తి కనబరుస్తుండటం ప్రాధాన్యంశంగా మారింది. ఎస్టీ రిజర్వ్ స్థానమైన ఈ లోక్‌సభ బరిలో నిలిచేందుకు రాజకీయ నాయకులతో పాటు వైద్యులు, సినీనటులు, సామాజిక వేత్తలతో పాటు కొత్త వారు సైతం సిద్ధమవుతుండటం ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ఆయా పార్టీల అధిష్టానాల ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు. తమకు టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తామని విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు ఎన్నికల్లో అవసరమైన ఖర్చులకు కూడా వెనకాడమని చెబుతున్నారు. మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగతాయనే ప్రచారంతో ఇప్పట్నుంచే ఆయా ప్రధాన పార్టీల నుంచి బరిలో దిగేందుకు ఆశావహులు రంగం సిద్ధం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాన పార్టీల నుంచి అనేక మంది ఆశావహులు టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నా..ఆయా పార్టీలు ఎవరిని బరిలో నిలుపుతాయోనని ఆసక్తి రేపుతోంది.

ఆదిలాబాద్ లోక్‌సభ సీటును దక్కించుకోవాలని ఆయా ప్రధాన పార్టీలు దృష్టిసారిస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మరోసారి సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని ఆరాట పడుతుండగా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ లోక్‌సభను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇక రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ మూడు పార్టీలు సైతం లోక్‌సభ స్థానాన్ని దక్కించుకునేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. వీటితో పాటు పలు జాతీయ పార్టీలు కూడా లోక్‌సభ బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రధాన పార్టీల నుంచి టికెట్లు దక్కించుకోవాలని పార్లమెంటుకు వెళ్లాలని అనేక మంది ఆశలు పెట్టుకుంటున్నారు. ఇందులో ఇది వరకే రాజకీయాల్లో రాణించి పలు పదవులు పొందిన వారితో పాటు వైద్య వృత్తిలో రాణిస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న వారు సైతం లోక్‌సభకు వెళ్లాలని ఆరాటపడుతున్నారు. ముఖ్యంగా ఒకరిద్దరు సినీ రంగానికి చెందిన వారు, ఆయా రంగాల్లో సామాజిక సేవలు అందిస్తున్నవారితో పాటు ఆయా సామాజిక వర్గాల్లో గుర్తింపు పొంది బలమైన నాయకులుగా ప్రజల్లో గుర్తింపు సాధించిన వారు సైతం బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు పట్టణాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించడంతో పాటు రోడ్ల పక్కన పదుల సంఖ్యలో [illegible] ఏర్పాటుచేయడం, పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టి జనం దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. పండగలకు శుభాకాంక్షలు చెప్పడం.. సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. కొందరు ఆశావహులు ఇప్పటికే ఆయా పార్టీల తరఫున బరిలో ఉంటామని స్థానిక నాయకులు, యువతను కూడగట్టి గ్రామాల్లో ప్రచారం ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది.

టికెట్ల కోసం అధిష్టానాల వద్దకు..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఇందులో ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు నియోజకవర్గాలున్నాయి. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఖానాపూర్, ముథోల్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు ఈ లోక్‌సభ పరిధిలోకి రాగా.. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలు పెద్దపల్లి పార్లమెంటు స్థానం పరిధిలోకి వస్తాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాలుగు అసెంబ్లీ స్థానాలు గెలుచుకోగా.. కాంగ్రెస్ ఒక స్థానం, బీఆర్ఎస్ రెండింటిలో విజయం సాధించింది. లోక్‌సభ స్థానాన్ని దక్కించుకోవడానికి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. బీజేపీకి ఇది వరకే సిట్టింగ్ ఎంపీ ఉన్నప్పటికీ ఈ స్థానంలో పోటీ చేసేందుకు పలువురు ఆ పార్టీకి చెందిన నాయకులతో పాటు కొత్త వారు సైతం టికెట్ ఆశిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచేందుకు సైతం అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే హస్తం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులతో పాటు పలువురు కొత్త వారు సైతం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ నుంచి ఇది వరకే ఆ పార్టీలో ఉన్న నాయకుడికే టికెట్ కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఆయా పార్టీలకు చెందిన నాయకులతో పాటు కొత్త వారు సైతం తెలిసిన వారి ద్వారా ఆయా పార్టీల అధిష్టానాల ముఖ్య నేతలను కలుస్తూ టికెట్లు కేటాయించాలని అభ్యర్థిస్తున్నారు. టికెట్ తమకంటే తమకే వస్తుందని ఎవరికి వారు ప్రచారం చేసుకోవడంతో జనాల్లోనూ అయోమయం కనిపిస్తోంది. ఇందులో ఆయా పార్టీల నుంచి ఎవరికి టికెట్ వస్తుందనే చర్చ జనాల్లోనూ మొదలు కావడం ఉమ్మడి జిల్లా రాజకీయం మరింత ఆసక్తికరంగా మారుతోంది.



ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభాస్థలి వద్ద పోటాపోటీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లు, హోర్డింగులు

ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌కు నరేష్ జాదవ్ దరఖాస్తు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి శనివారంఏఐసీసీ సభ్యులు డాక్టర్ నరేష్ జాదవ్ గాంధీభవన్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, విద్యార్థి ఉద్యమకారులు డా.కృష్ణ నాయక్, డా.వినోద్, రవీందర్ నాయక్, గోవింద్, విద్యాసాగర్, సురేష్, రవి పాల్గొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి విద్యావంతుడైన డాక్టర్ నరేష్ జాదవ్‌కు అవకాశం కల్పిస్తే సబ్బండ వర్గాలు ఏకమై అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటారని నాయకులు ఈ సందర్భంగా ఏఐసీసీ అధినాయకత్వానికి విజ్ఞప్తి చేశారు.



కుష్టువ్యాధిపై అవగాహన



నవతెలంగాణ - బెజ్జూరు

మండలంలోని పెద్దసిద్ధాపూర్ గ్రామ పంచాయతీలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు కుష్టి వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా మాట్లాడుతూ కుష్టు వ్యాధి మచ్చలు సహజ చర్మపు రంగు కంటే తక్కువ లేదా రాగి రంగు కలిగి ఉంటాయన్నారు. మచ్చలపై స్పర్శ ఉండదని, దేహంలో ఏ ప్రదేశంలోనైనా కుష్టు వ్యాధి మచ్చ రావచ్చని తెలిపారు. ఈ వ్యాధి నరాలకు సోకితే కాళ్ల లేక చేతులకు తిమ్మిర్లు, బలహీనత, స్పర్శ కోల్పోడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. దీనికి ఒకటి నుండి ఐదు మచ్చలు ఉన్న వారికి ఆరు నెలలు, ఐదు కన్నా ఎక్కువ మచ్చలు ఉన్న వారికి 12 నెలల కాలంలో చికిత్స అందించినట్టయితే నయమవుతుందన్నారు. చర్మంపై ఏ రకమైన మచ్చలున్న దగ్గరలోని ఆరోగ్య కార్యకర్తను కానీ, ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జావిద్, పంచాయతీ కార్యదర్శి మీసారి వైకుంఠం, ఎఎన్ఎం మేఘన, సుస్మిత, అంగన్‌వాడీ కార్యకర్త రాచకొండ స్వప్న, ఆశా కార్యకర్త ఈశ్వరి, పంచాయతీ ఎంపీడబ్ల్యూ సాయి, సురేష్ పాల్గొన్నారు.

ప్రతిభా క్రీడాకారులకు ఘన స్వాగతం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆంధ్రప్రదేశ్‌లోని చీరాలలో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులకు శనివారం రైల్వేస్టేషన్‌లో షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిని రవి కుమార్, గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారధి స్వాగతం పలికారు. పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని రవికుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయి సబ్ జూనియర్ విభాగంలో తెలంగాణ బాలుర జట్టు ప్రథమ స్థానం, జూనియర్ బాయ్స్ 2వ స్థానం, జూనియర్ బాలికలు రెండవ స్థానం సాధించారన్నారు. గతంలో ఎన్నడూ రాని పతకాలు ఈ సారి రాష్ట్ర స్థాయిలో రావడం అభినందనీయమన్నారు. కోచ్‌లు క్రీడకారులకు అందిచ్చిన శిక్షణ ఎంతో మేలు చేసిందన్నారు. సంఘానికి, క్రీడాకారులకు ఎంతో మంది సహకారం అందించారని, వారందరికి ఈ సందర్భంగా ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు హరిచరణ్, డాక్టర్ క్రాంతి, రాష్ట్రపాల్ పాల్గొన్నారు.

వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-తాంసి

తెలంగాణ గజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(టిజిజెఎల్ఎ475) వార్షిక క్యాలెండర్‌ను శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరెడ్డి అసోసియేష్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జూనియర్ లెక్చరర్స్ వెంకటరమణరెడ్డి, శశి ప్రవీణ్‌కుమార్, మల్లేష్, తెలంగాణ గజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చట్ల ప్రవీణ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

5న నర్సారెడ్డి సంస్మరణ సభ

నవతెలంగాణ-నిర్మల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి దివంగత పొద్దుటూరి నర్సారెడ్డి సంస్మరణ సభ ఈ నెల 5న నిర్వహిస్తున్నట్టు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ఇందిరా హాల్‌లో ఉదయం 11గంటలకు సంస్మరణ సభ ఉంటుందని, ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఏఐసీసీ అగ్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. నర్సారెడ్డి అభిమానులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

నేడు కేంద్ర కార్మిక, రైతు సంఘాల జిల్లా సదస్సు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ సన్నాహక సదస్సును ఆదివారం సెంట్రల్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వీగిన అవిశ్వాసం తీర్మానం

- మున్సిపాలిటీని నిలబెట్టుకున్న బీఆర్ఎస్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. శనివారం ఆర్‌డిఓ రాములు ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ప్రక్రియ ప్రారంభమైంది. మున్సిపాలిటీలో 15 రోజులుగా రాజకీయం రసవత్తరంగా, రోజుకో మలుపు తిరుగుతూ కొనసాగింది. పది మంది కౌన్సిలర్లు గత నెల 6న కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మాన నోటీస్ అందజేశారు. దీంతో మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని అందరూ భావించారు. కానీ రాజకీయ ఎత్తుగడలో భాగంగా చేజారిపోయింది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 5 కౌన్సిలర్ల స్థానాలు గెలిచాయి. మరొకరు ఇండిపెండెంట్‌గా గెలిచాడు. బీఆర్ఎస్ నుంచి చైర్మన్‌గా నల్మాస్ కాంతయ్య , వైస్ చైర్మన్‌గా పోడేటి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో వారి సంఖ్య 9కి చేరింది. బల నిరూపణకు మూడో వంతు మెజార్టీ కోసం ప్రయత్నాలు చేశారు. తొమ్మిదవ వార్డ్ కౌన్సిలర్ శ్రీకాంత్ కాంగ్రెస్‌లో చేరనప్పటికీ అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. మున్సిపాలిటీని హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేయగా బీఆర్ఎస్ ఎత్తుకు పైఎత్తులు వేస్తూ అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చేసి చివరికి విజయం సాధించింది.



మద్దతిచ్చి రహస్య శిబిరానికి కౌన్సిలర్

చైర్మన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికిన తొమ్మిదవ వార్డ్ కౌన్సిలర్ శ్రీకాంత్‌తో పాటు చైర్మన్, వైస్ చైర్మన్, మరో ముగ్గురు కౌన్సిలర్లు 15 రోజులుగా రహస్య శిబిరానికి వెళ్లడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఇది కాంగ్రెస్ పార్టీకి ఊహించని పరిణామం. అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికిన శ్రీకాంత్‌ను తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు చేసింది. రోజుకో మలుపు తిరుగుతూ రాజకీయం రసవత్తరంగా కొనసాగింది. కానీ వారి ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. బీఆర్ఎస్ ఎత్తుకు పైఎత్తు వేస్తూ అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చేసుకుంది. ఈ సందర్భంగా ఆర్డిఓ వడాల రాములు మాట్లాడుతూ ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్యపై, మధ్యాహ్నం 12.30కు వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి సభ్యులెవరూ హాజరు కాలేదన్నారు. సభ్యుల సంఖ్య 15 ఉండగా, అవసరమైన కోరం లేనందున అవిశ్వాస తీర్మాన సమావేశం మధ్యాహ్నం మూడున్నరకు వాయిదా వేశామని తెలిపారు. ఆ సమయానికి సైతం ఉండాల్సిన కోరం 10 మందికి ఎవరూ లేనందున అవిశ్వాస తీర్మానం ఓటింగ్ జరగలేదని తెలిపారు. రూల్ 10(3)ప్రకారం అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని రాములు ప్రకటించారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని 33కెవి భుక్తాపూర్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఫీడర్ పరిధిలోని భుక్తాపూర్, ద్వారకానగర్, సినిమా రోడ్, మోచిగల్లీ ఏరియాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అంతరాయానికి వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

నేచర్ క్యాంప్ విద్యార్థుల్లో పర్యావరణం పట్ల అవగాహన కలిగిస్తుంది


- జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

నేచర్ క్యాంప్ విద్యార్థుల్లో పర్యావరణం పట్ల అవగాహన కలిగిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్ అన్నారు. సర్సిల్క్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో డీఈఓ పాల్గొని మాట్లాడారు. నేషనల్ గ్రీన్ కోర్ జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో 8 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేచర్ క్యాంప్ నిర్వహించడం విద్యార్థులకు పర్యావరణ స్పృహను కలిగిస్తుందన్నారు. ప్రకృతి సమతుల్యత ఆవశ్యకతను విద్యార్థులలో కల్పించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జాతీయ హరిత దళం రీజనల్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ నేచర్ క్యాంప్ నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు ఫారెస్ట్ అధికారులు ఎంతగానో సహకరించాలని తెలిపారు. విద్యార్థులకు అటవీ సంపదపై అవగాహన, పక్షులను పరిశీలింప చేయడం, సంపద పక్షుల మధ్య ఉండే సంబంధం పరిశీలించే కృత్యాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. నీటి పుట్టుకకు అడవికి గల సంబంధాన్ని విద్యార్థులు పరిశీలించేలా కృత్యాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కటుకం మధుకర్, ఎఫ్ఆర్ఓ రమాదేవి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అబిద్ అలీ, నోడల్ అధికారి దేవాజి, ప్రధానోపాధ్యాయులు శ్రీలత, వరలక్ష్మి, అనురాధ, విజయలక్ష్మి, రమాదేవి, నీరజ, కవిత, జయలక్ష్మి, భారతి, లక్ష్మీపసన్న పాల్గొన్నారు.

పరీక్ష సామాగ్రి పంపిణీ చేసిన ఉపాధ్యాయ దంపతులు



నవతెలంగాణ- తలమడుగు

ఖోడద్ గ్రామ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్న కృష్ణకుమారి-విలాస్‌గౌడ్ దంపతులు శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని పంపిణీ చేశారు. పరీక్షలకు అవసరమయ్యే ప్యాడ్, పెన్, పెన్సిల్, షార్పనర్, ఎరైజర్ మొదలైనవి అందజేశారు. ఉపాధ్యాయ దంపతులకు పాఠశాల తరపున ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.వెంకట్‌రావ్, ఎంపిడిఓ రమాకాంత్, పాఠశాల చైర్మన్ గంగన్న, కృష్ణకుమారి, విలాస్‌గౌడ్, రామకృష్ణగౌడ్, లలిత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-తాంసీ

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో శనివారం వివిధ ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన జే.పల్లవి పదో తరగతి, రాదరపు భిందుజ, 9వ తరగతి శివ ప్రియ 8వ



తరగతి, ఈ ముగ్గురు విద్యార్థులు జిల్లాస్థాయి పరీక్షల్లో విజేతలుగా నిలిచారు. వీరు రాష్ట్రస్థాయి పరీక్షల్లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు డీఈఓ ప్రణీత ప్రశంస పత్రాలను అందించి అభినందించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడానికి పూర్తి సహకారం అందించిన సైన్స్ ఉపాధ్యాయులు ఉమా మహేష్‌కు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల నియామకం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సర్పంచ్ పదవి కాలం ముగియడంతో సర్పంచ్ ఎన్నికలు అయ్యే వరకు గ్రామపంచాయతీలకు స్పెషల్ అధికారుల పాలనను కొనసాగిస్తుంది. ఉట్నూర్ ఏజెన్సీలోని శనివారం గంగాపూర్, కన్నాపూర గణేష్, చిత్తకర సూరజ్, చందూరి, మారుగూడ దిలీప్ కుమార్, దంతనపల్లి, దొంగచింతకు సురేందర్, ఘనపూర్, లక్కారం, మత్తడిగూడకు తిరుమల, జైత్రంతండా నారాయణ, జమాలతండకు సూరజ్, కామాయిపేట్‌కు లింగయ్య, లక్షెట్టిపేట్‌కు లింగన్న, నద్దంగూడ, నాగపూర్‌లకు రమేష్‌లను నియమించారు.

అడ్డంకులు ఎదుర్కొని విజయాలు సాధించాలి

- జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు
- పాల్గొన్న ప్రముఖ వైద్యురాలు డా.సుమలత



చెకుముకి టెస్ట్ పేపర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖ వైద్యురాలు సుమలత, జనవిజ్ఞాన వేదిక నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జీవితంలో ఏదైనా సాధించేటప్పుడు వచ్చే అడ్డంకులను మెట్టులాగా మలుచుకుంటూ అనుకున్న లక్ష్యాలను సాధించాలని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సుమలత అన్నారు. శనివారం డైట్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై టెస్టు పేపర్లను ఆవిష్కరించారు. మూఢ నమ్మకాల నుంచి విముక్తికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రశ్న మొదలైతే దాన్ని సాధించే పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఆదిలాబాద్ విద్యార్థులు ఎంపిక కావాలని ఆకాక్షించారు.

రాష్ట్రస్థాయిలో జిల్లా పేరును నిలబెట్టాలి...

రాష్ట్రస్థాయిలో జిల్లా పేరును నిలబెట్టాలని జిల్లా విద్యాశాఖధికారి ప్రణీత అన్నారు. శనివారం డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచి రాష్ట్రానికి ఎంపికైన విద్యార్థులను డీఈఓ సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు. డీఈఓ మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11వ తేదీలో జనగామ పట్టణంలో జరగబోయే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్సు సంబరాల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి జి నారాయణ, డిస్టిక్ సైన్స్ అధికారి రఘురమణ, ట్రస్మా ప్రధాన కార్యదర్శి దేవేందర్ పటాస్కర్, ఫిజికల్ ఫోరం నాయకులు చంద్రశేఖర్, జన విజ్ఞాన వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంతోష్, రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు దీప్తి, శ్రీధర్ బాబు, వీరన్న, శ్రీనివాస్, గంగన్న, లింగారెడ్డి, సుభాష్ గంగయ్య యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు.

నిర్మల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలను జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లాలోని 38 పాఠశాలలకు చెందిన 114 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా డీఈఓ రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులలో విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. సృజనాత్మక శక్తిని, సమస్యలకు పరిష్కారాలు వెతకటం చెకుముకి పరీక్ష ద్వారా చైతన్య పరుస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. తద్వారా శాస్త్రీయ ధృక్పథం కలిగి ఉండాలని అన్నారు. జిల్లా స్థాయి పరీక్షలో ప్రథమంగా వచ్చిన ప్రభుత్వ తెలుగు మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుబీర్ విద్యార్థులు, ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భోసి విద్యార్థులు, ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం నుంచి శాంతి నికేతన్ నిర్మల్ విద్యార్థులు, రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని తెలిపారు. ప్రథమంగా వచ్చిన విద్యార్థులకు ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాజర్ల నారాయణ వర్మ, గౌరవ అధ్యక్షులు ఆకుల సుదర్శన్, కొండా రాములు, పర్యావరణ కమిటీ కన్వీనర్ సల్లా పోశెట్టి, కార్యదర్శులు రఫీక్, బచ్చు శ్రీనివాస్, వందన, రాష్ట్ర కార్యదర్శి గజపల్లి నర్సయ్య పాల్గొన్నారు.



చెకుముకి టెస్ట్ పేపర్లను విడుదల చేస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

ఎంపీ టికెట్‌కు సభావత్ శ్రీనివాస్ నాయక్ దరఖాస్తు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ తరపున లోకసభ ఎన్నికల్లో బరిలో నిలించేందుకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సభావత్ శ్రీనివాస్ నాయక్ సిద్ధమయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఎంపీ టికెట్టు కేటాయించాలని దరఖాస్తు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదట బోథ్ అసెంబ్లీ టికెట్టు ఆశించి, బంగపడినప్పటికీ, అధిష్టానం నిర్ణయం మేరకు పనిచేసినట్టు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టానని గుర్తుచేశారు. ఎంపీ టికెట్ కేటాయిస్తే ఆదిలాబాద్ ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తెలిపారు. పార్టీ అధిష్టానం తనకు ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. ఆయన వెంట నాయకులు గోపి రాథోడ్, నరేష్ తదితరులున్నారు.

పవన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-తలమడుగు



జైనథ్ మండల కేంద్రానికి చెందిన పవన్ గత కొద్ది రోజుల కింద రాజధానిలోని ఒమేగా ఆస్పత్రిలో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేసుకొని రాగా శనివారం తలమడుగు జైనథ్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌లో పనిచేస్తున్న కాడే స్వామి, శ్రీనివాస్, ఆంజనేయులు, సూర్య, పవన్‌కు రూ10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. పవన్ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో విషయాన్ని తెలుసుకున్న బ్యాంక్ సిబ్బంది. జిల్లా కేంద్రంలో నివాసముంటున్న పవన్ ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. అదేవిధంగా లక్ష్మీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గంగమ్మ రాజేశ్వర్ రూ.3వేల నగదు ఆర్థిక సాయాన్ని అందజేసి కుటుంబానికి మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. పవన్ కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయాన్ని అందజేసి ప్రాణాన్ని కాపాడాలన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాత్నాల క్వార్టర్స్ ఆవరణలో ఉన్న జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో వివిధ రకాల ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగల ఎంపికకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బుధవారం తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్‌లు తీసుకోని ఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం ఆదిలాబాద్‌లో జాబ్ మేళాకి హాజరుకావాలని కోరారు. వివరాలకు సంప్రదించాల్సిన్న నెంబర్. 7659978443, 9866366320.

ఉచిత వినికిడి యంత్రాలు అందిస్తాం

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని కుమురంభీం కాంప్లెక్స్‌లో ఉన్న వికాసం పాఠాశాలలో విహెయిర్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపును నిర్వహించి, వినికిడి విద్యార్థులకు ఉచిత టెస్ట్ చేశారు. ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ మండలం నుంచి చెవిటి, మూగ, అందులు, మానసిక వికాసం గల పిల్లలు హాజరయ్యారు. వినికిడి యంత్రం ఖరీదు రూ.70వేలు ఉంటుందని, అలాంటి యంత్రాన్ని క్యాంపు ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తామని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ వికాస్ మాట్లాడుతూ వికాసం ఉన్న పిల్లలు ఉచిత క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు మంచి అవకాశం ఉందని, లోపం ఉన్న పిల్లలకు వికాసం పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, క్యాంప్ కంపెనీ సిబ్బంది ఉన్నారు.

ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థిగా టికెట్‌ను ఆశిస్తూ శనివారం హైదరాబాద్‌లో సుగుణక్క దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయురాలుగా, సామాజిక సేవా కార్యకర్తగా ప్రజలకు సేవలందిస్తోంది ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడానికి తన అభ్యర్థిత్వాన్ని దానికి సంబంధించిన పత్రాలను గాంధీభవన్‌లో సుగుణక్క సైన్యం సభ్యులు సమర్పించారు.

కొత్తవారికే అవకాశం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని సేవాదాస్ నగర్ నివాసి బానోత్ జగన్ అడ్వకేట్ శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బీజేపీ పార్టీ నుంచి అవకాశం ఇస్తే తప్పకుండా గెలిస్తానని అన్నారు. కొత్తవారికి పార్టీ నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకి ఎంపీ టికెట్ కేటాయించాలని, రాష్ట్ర అధ్యక్షులను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తప్పకుండా పార్టీ కోసం కష్ట పడే కార్యకర్తలు, నాయకులకు ఈసారి కొత్తవారికే ఎంపీ టికెట్ కేటాయించే ఆలోచనలో పార్టీ ఉందని సూచించారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజీ తండా గ్రామపంచాయతీ ఎక్స్‌రోడ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్ మాజీ స్థానిక సర్పంచ్ హరినాయక్, స్టాఫ్ నర్స్ బృందం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామ కమిటీలు ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని లింగూడ, పెద్దమాలే బోరిగాం, ఖండాల, ఖానాపూర్ గ్రామాలలో శనివారం బీఆర్ఎస్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పటిష్టత కోసం మనమందరం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంగయ్య యాదవ్, దేవిదాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభమైన సదల్‌పూర్ జాతర

నవతెలంగాణ-బేల

మండలంలోని సదల్‌పూర్ గ్రామంలోనీ బైరాందేవ్, మహదేవ్ ఆలయంలో ఏటా పుశ్యమాసంలో ప్రారంభమయ్యే జంగి జాతరకు ముస్తాబైంది. గత 55 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ జాతర ప్రారంభాన్ని పురస్కరించుకొని గిరిజన సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం డోలు వాయిద్యాలు, భజన సంకీర్తనల నడుమ బై రాందేవ్, మహదేవ్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా కోరంగే సోనేరావ్ దంపతులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కోనేరు జలంతో ముందుగా ఆలయ ఆవరణలోని గణేశునికి మొదటి పూజ నిర్వహించిన అనంతరం ఆలయంలోని శివలింగానికి, బైరామ్‌దేవ్‌లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే జాతర కంటే ఈ జాతర ప్రత్యేక విశిష్టతను సంతరించుకుంది. ఎన్నో ఏండ్ల నాటి బైరామ్‌దేవ్ ఆలయంలో ఆవరణలో వాటి చుట్టూ ఉన్న విగ్రహాలు బయటపడ్డాయి. వాటిని చూసేందుకు భక్తులు వాటిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు రాందాస్ మాట్లాడుతూ ప్రతి ఏటా పుశ్య మాసంలో ప్రారంభమవుతుందని అన్నారు. మొదటి రోజు మహదేవ్, బైరామ్‌దేవ్‌లకు అభిషేకంతో పారంభమై వారం రోజుల పాటు కొనసాగగా ఈ నెల 9న ముగుస్తుందన్నారు. ఈ జాతరకు తెలంగాణ నుండే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ నుంచి భక్తులు వస్తుంటారని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.

రాజకీయం కోసమే సీఎం పర్యటన

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 2న కేస్లాపూర్ నాగోబా దేవస్థానం, అమరవీరుల స్తూపం ఇంద్రవెల్లి పర్యటన కేవలం రాజకీయ స్వలాభం కోసం మాత్రమేనని తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం మీడియాతో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల ప్రజల దైవంగా కేస్లాపూర్ దేవ సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి కనీసం ఆదివాసుల సమస్యల మీద మాట్లాడకపోవడం బాధకరమని అన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు వివిధ సంఘాల పెద్దలు ఎస్పీ అనుమతితో కలువడానికి ఉదయం నుంచి వేచి చూసిన ఆఖరికి నిరాశే ఎదురైందన్నారు. ఆదివాసుల సమస్యలు వినేందుకు కనీసం ఐదు నిమిషాలు కూడా కేటాయించకపోవడంపై ఆదివాసీ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఇది ముమ్మాటికీ ఎంపీ ఎన్నికల డ్రామా మాత్రమేనని ఆదివాసీ ప్రజలు గ్రహించారని అన్నారు. వారి వెంట తుడుం దెబ్బ మండల నాయకులు మానిక్‌రావ్, అడా శ్రీరామ్, ఉర్వేత మానిక్‌రావు, మెస్రం హన్మంత్, అర్క గోవింద్, ఉర్వేత రుప్‌దేవ్, ఆనంద్‌రావ్, పెందుర్ దీపక్ ఉన్నారు.

ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-నార్నూర్

సర్పంచుల పదవీకాలం ముగియడంతో నార్నూర్ మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో, గాదిగూడ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో కలిపి మొత్తం ఉమ్మడి నార్నూర్ మండలంలోని 48 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు. నార్నూర్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎంపీడీఓ రమేష్, ఆర్ఐ దశరథ్, ఎంపీఓ సత్యానంద స్వామి, తహసీల్దార్ రాజ లింగం, ఏఈఈ జాడి లింగన్న, డీటీ అమృత్ లాల్, అదే విధంగా గాదిగూడ మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో ఇన్‌ఛార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న గంగాసింగ్‌కు ప్రత్యేకాధికారిగా నియమించారు. జామడ, తాడిహత్నూర్, గంగాపూర్‌లకు ఏఈ లింగన్న, బాధ్యతలు చేపట్టడంతో శనివారం జామడ తాడిహత్నూర్‌లకు జిల్లా సార్మెడి దుర్గు పటేల్, మాజీ సర్పంచ్ ముక్తా రూపదేవ్, తాడిహత్నూర్‌లో ఉపసర్పంచ్ విష్ణు, కార్యదర్శి శేఖర్, కారోబారి దినేష్, వార్డు సభ్యులు శాలువాతో సన్మానం చేశారు.

'సమాజంలో సాంఘిక శాస్త్రం విలువలు పెంపొందిస్తుంది'

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

సమాజంలో విలువలు పెంపొందించడంలో సాంఘిక శాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని, నిరంతర సాధన ద్వారానే సాంఘిక శాస్త్రంలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఈఓ ప్రణీత అన్నారు. శనివారం పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షకు ఆమె పాల్గొని మాట్లాడారు. పరీక్ష ద్వారా విద్యార్థులు తమ సన్నద్ధతను అంచానా వేసుకోవచ్చని అన్నారు. ఈ ప్రతిభ పరీక్ష నిర్వహణకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు సిలివెరి రాములు, సంతోష్ భేదోడ్కర్, సెక్టోరల్ అధికారి నారాయణ, ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, వెంకట్‌రావ్, రాంకిషన్, విజయలక్ష్మి, మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, గోవర్ధన్, గంగయ్య, రాజేష్, రాజేందర్, రాము పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



డిగ్రీ ప్రవేశాల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కళాశాల అధ్యాపకులు

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రయివేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో అన్ని సౌకర్యాలతో కూడిన విద్య బోధనను అందించడం జరుగుతుందని, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉట్నూరు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని అన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. బాలురు, బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి ఎన్‌సీసీ కోర్సులు కూడా ఉంటాయని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదల కాగానే డిగ్రీ కళాశాలలకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.స్వామి, అధ్యాపకులు డాక్టర్ సంగీత, శ్రావణి, శ్రీధర దేవి, రవీందర్, రాజ్ కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, జావిద్, చరణ్, హంసరాజ్ ఉన్నారు.

పోటీ పరీక్షల్లో కష్టపడి లక్ష్యాలను చేరుకోవాలి

- గ్రూప్స్ శిక్షణ ప్రారంభించిన ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో



నిరుద్యోగ యువతతో మాట్లాడుతున్న శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాధారణ పరీక్షల కంటే పోటీ పరీక్షలు ఉంటాయని, కష్టపడి లక్ష్యాలను చేరుకోవాలని శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. శనివారం బీసీ సంక్షేమ శాఖ, బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్స్ నాలుగు నెలల ఉచిత శిక్షణను ఆయన ప్రారంభించారు. బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చిన శిక్షణ సహాయ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి భాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఫౌండేషన్ కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం బీసీ వెల్ఫర్ ద్వారా అందించే శిక్షణాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ కొలువుల్లో రాణించాలన్నారు. పోటీ పరీక్షలు సాధారణ పరీక్షలకంటే ఎంతో భిన్నంగా ఉంటాయని, వాటిని అవగాహన చేసుకుంటూ సన్నద్ధం కావాలని సూచించారు. ఉచితంగా నాలుగు నెలల పాటు అందించే శిక్షణాలతో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫర్ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన డీఐఈఓ



క్యాలెండర్‌ను విడుదల చేసిన డీఐఈఓ రవీందర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో డీఐఈఓ రవీందర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవాండ్లు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గేడం కేశవ్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఏఐఎస్ఎఫ్ ప్రధాన కర్తవ్యమని అన్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అని, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, డైట్ చార్జీలు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ జరపాలని డిమాండ్ చేశారు. గత పాలకులతో విసుగుచెందిన యువత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలవాలని అన్నారు. లేని పక్షంలో తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మెస్రం ప్రవీణ్ కుమార్, గేడం మాణిక్, నాయకులు తబ్రిజ్, ప్రియ, నందిని, సుశీల, కవిత, శృతి, లావణ్య, సునీల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

అండర్-14 ఖోఖో పోటీల్లో సెమీఫైనల్‌లో తెలంగాణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జనవరి 31 నుండి ఝార్ఖండ్ రాజధాని రాంచీలో జరుగుతున్న 67వ జాతీయ స్థాయి అండర్-14 బాలబాలికల ఖోఖో పోటీల క్వార్టర్ ఫైనల్స్‌లో హర్యానాపై గెలుపొంది సెమీఫైనల్లో తెలంగాణ జట్టు ప్రవేశించింది. బాలుర టీమ్‌కు సంబంధించి పోటీల కోచ్ మేనేజర్లుగా జిల్లాకు చెందిన తిరుమల్, మంగ, మీనరెడ్డి, రాజయ్య సాంబశివరావులు వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులు బాగా ఆడుతున్నారని ఫైనాల్స్‌లో తెలంగాణ విజయం సాధిస్తుందని ధీమావ్యక్తం చేస్తున్నారు.

నూతన ఎంపీడీఓగా రమేష్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



నూతన ఎంపీడీఓగా డి.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జిల్లా మంత్రి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పెంచికల్‌పేట్ వచ్చారు. నూతనంగా వచ్చిన ఎంపీడీఓను తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ గంగాసింగ్ మండల పరిషత్ సిబ్బంది శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు మనోహర్, రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెను ప్రమాదం



నవతెలంగాణ-చింతలమానేపెల్లి

మహారాష్ట్రలోని అహిరి నుండి కాగజ్‌నగర్ వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు కర్జెల్లి, చింతలమానేపెల్లి మధ్యలో బస్సు టైర్ రాడ్ విరిగి పోయింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ప్రభాకర్ బస్సును అదుపు చేసి పక్కకు ఆపారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో 55 మంది ప్రయాణికులు ఉన్నట్లు కండక్టర్ కుడుకా శంకర్ తెలిపారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతోనే ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించారు. ప్రయాణికులను వివరణ అడుగగా గుంతలు పడ్డ రోడ్డుపై కాలం చెల్లిన బస్సులను నడిపించడంతోనే ఇలా జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్లను మరమ్మత్తులు చేసి నూతన బస్సులు నడిపించాలని కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధూకర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో గావ్‌ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రోగ్రాం కన్వీనర్ నాగేష్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో బూత్ ప్రవాసి కార్యకర్తలను నియమించారు.

గొర్రె మృతి ఘటనలో ఒకరిపై కేసు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్


మండలంలోని ఆరెగూడ శివారులో పుచ్చకాయ తోటను అడవీ జంతువుల నుంచి కాపాడుకునేందు ఓ రైతు ఇనుప వైరు కంచెకు విద్యుత్ కనెక్షను ఇచ్చాడు. అటువైపు మేతకు వచ్చిన గొర్రె కంచెకు తగిలి కరెంట్‌షాక్‌తో చనిపోయింది. ఈ ఘటనలో శుక్రవారం రాత్రి రైతుపై కేసునమోదైనట్టు ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ఆరెగూడ గ్రామానికి చెందిన రైతు చౌదరి లక్ష్మణ్ తాను సాగుచేసిన పుచ్చకాయ తోటను అటవీ జంతువుల నుంచి కాపాడుకునేందుకు ఇనుపవైరుతో కంచె వేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్టు తెలిపారు. అటువైపు కడంబా గ్రామానికి చెందిన ఒరుదల మహేష్ గొర్రెల మందను తొలుకొని రాగా ఒక గొర్రె కంచెకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతిచెందింది. గొర్రె మృతికి కారకుడైన చౌదరి లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

సర్పంచ్ పదవికి పదవ తరగతి నిబంధన వర్తింపజేయాలి

నవతెలంగాణ-కెరమెరి

త్వరలో నిర్వహించే సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పదవ తరగతి అర్హత నిబంధన వర్తింపజేయాలని మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గ్గారే బాలాజీ అన్నారు. శనివారం ఆయన విలేకులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో విద్యావంతులు సర్పంచ్‌గా ఎన్నికైతే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై వచ్చే ఎన్నికలలోపు సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థికి పదవ తరగతి నిబంధన జీఓ జారీ చేయాలన్నారు.

గడపగడపకు కేంద్ర పథకాలు తెలియజేయాలి



నవతెలంగాణ-తాండూర్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకు తెలియజేస్తూ వాటిని సద్వినియోగం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా కార్యదర్శి మాసు రజనీ, బీజేపీ మండల అధ్యక్షుడు రామగౌని మహీధర్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గావ్ ఛలో అభియాన్‌పై కార్యకర్తలతో సమావేశం నిర్వహించగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కేంద్రంలో బలోపేతంగా ఉందని, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించి మరో సారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక కార్యకర్త గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గ్రామాల్లో రానున్న ఎన్నికల కోసం పల్లెనిద్రల ద్వారా ప్రజలకు చేరువవుతామని, అదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిలువేరి శేషగిరి, మండల ప్రధాన కార్యదర్శి దూడపాక భరత్, ఉపాధ్యక్షులు పుట్ట కుమార్, అధికార ప్రతినిధి సిద్దం మల్లేష్, కోశాధికారి రాచర్ల సురేష్, గావ్‌ఛలో అభియాన్ మండల కో కన్వీనర్ శ్రావణ్, మధు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ

- రాష్ట్ర మంత్రి సీతక్క




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందించి ప్రత్యేక అధికారుల పాలన ద్వారా అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం ములుగు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుండి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో గ్రామపంచాయతీల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక అధికారుల పాలన ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పూర్తి స్థాయిలో తాగునీరు అందించడంతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ సర్పంచ్ల పదవీకాలం ముగిసినందున జీపీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేసే విధంగా గ్రామీణ నీటి సరఫరా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీరు అందిస్తామన్నారు. గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించడంతో పాటు కూలీల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, డంపింగ్ యార్డ నిర్వహణ, వైకుంఠధామాల అభివృద్ధిపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఈనెల 7 నుండి 15 వరకు గ్రామపంచాయతీలలో పారిశుధ్యం పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనిపై ఇప్పటికే అధికారులకు సూచనలు చేశామని మంత్రికి కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందం పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-వాంకిడి

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన పదేండ్ల కాలంలో కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరించిన బీజేపీకి బుద్ధి చెప్పాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శనివారం సమ్మెకు సంబంధించిన పోస్టర్లను మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తయినా రైతాంగ, కార్మిక, ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. భారత్ వెలిగిపోతుందని, అచ్చేదిన్ విశ్వగురువు ఆత్మ నిర్భయ భారత్ మన్ మెక్ఇన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు ఇచ్చినా ఏమీ ఒరగలేదని, బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా నేడు ఉద్యోగ కల్పన పడిపోయిందన్నారు. నిరుద్యోగుల స్థాయి 50 సంవత్సరాల గరిష్టస్థాయికి చేరిందని, ఉన్న ప్రభుత్వ స్థలాలను ప్రయివేటు పరం చేస్తూ కొత్త పరిశ్రమలు లేవని, రోజురోజుకు నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని, ఒకవైపు ధరలు పెరుగుతున్నాయని, కష్టపడి పనిచేసే కార్మికుల వేతనం పెరగడంలేదన్నారు. అసంఘటిత కార్మికుల్లో పనిచేసే కార్మికులను పట్టించుకొనే పరిస్థితి లేదన్నారు. ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో భాగంగా ఈ నెల 11న కాగజ్‌నగర్ పట్టణంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బహిరంగ సభ నిర్వహిస్తామని, బహిరంగ సభకు జిల్లాలోని వివిధ కార్మిక సంఘాల్లో పనిచేసే కార్మికులందరు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు సీఐటీయూ ఆలిండియా కోశాధికారి ఎం సాయిబాబా, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, మధు, జయలక్ష్మి హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు రాకేష్, హమాలీ యూనియన్ సంఘం నాయకులు ధర్మేందర్, పోచయ్య, జాడె ధర్మ, మధు, నానాజీ, హమాలీ సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విమర్శలు పక్కనపెట్టి ఆరు గ్యారెంటీలపై దృష్టి పెట్టండి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై చేస్తున్న విమర్శలు పక్కనపెట్టి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై దృష్టి సారించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హితవు పలికారు. ఇంద్రవెల్లి సభలో సీఎం చేసిన వ్యాఖ్యలను జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన స్థాయి మరిచి మాట్లాడడం సరికాదన్నారు. తెలంగాణ రాకముందు ఆదివాసీలు గుర్తు రాలేద..? అని ప్రశ్నించారు. కుటుంబ రాజకీయాల గురించి కాంగ్రెస్ మాట్లాడడం విడ్డురంగా ఉందని, గాంధీ కుటుంబం నేటి వరకు పార్టీని నడుపుతున్న విషయం కూడా సీఎంకు తెలియదని ఎద్దేవ చేశారు. తాజా ఎన్నికల్లో విజయం సాధించిన ఉత్తంకుమార్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వివేక్‌లవి కుటుంబ రాజకీయాలు కావా అని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఐటీ అభివృద్ధి ఎంత జరిగిందన్నారు. కేస్లాపూర్ ఆలయానికి మూడు విడుదల రూ. 23 కోట్లు విడుదల చేశామని, రూ.కోటి విడుదల చేసిన కాంగ్రెస్ గొప్పగా చెప్తుందన్నారు. ముఖ్యమంత్రి ఇంద్రవెల్లి సభలో కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ కేసీఆర్ బయటకు వచ్చి 24 గంటలు కాకముందే రేవంత్ రెడ్డి వెన్నులో వణుకు పుట్టిందన్నారు. ఉమ్మడి జిల్లా మంత్రిగా సీతక్కను కేటాయించి ఆమె భుజంపై గన్ను పెట్టి ఆదివాసులను పేల్చాలని చూస్తున్నారని ఆరోపించారు. అన్ని విషయాలు ఆదివాసులు గమనిస్తున్నారని ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇంద్రవెల్లి సభలో బీజేపీని కనీసం విమర్శించకపోవడం వారి మధ్య ఉన్న పొత్తుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో మంజూరు చేసింది కోటి రూపాయలు పర్యటన కోసం ఖర్చు చేసింది రూ.5 కోట్లని విమర్శించారు. జెడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, ఎంపీటీసీ గాధవేణి మల్లేష్, నాయకులు అబ్దుల్లా, ఆత్రం అనిల్, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ శివారులో అంతర్జాతీయ రహదారి ప్రక్కన గల ప్రభుత్వ భూమిలో భూకబ్జాకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని నాయకులు, మండల ప్రజలు కోరుతున్నారు. శనివారం పనులు జరుగుతున్న ప్రదేశంలో కాంగ్రెస్ రెబ్బెన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేష్, నాయకులు అక్కడి వెళ్లి పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగాపూర్ మాజీ సర్పంచ్ భర్త పందిర్ల మధునయ్య ఈ కబ్జాకు పాల్పడుతున్నట్టు తెలిపారు. మార్కెట్‌లో ఈ భూమికి రూ. 20 నుండి రూ.30 లక్షల వరకు విలువ ఉండడంతో గతంలో కూడా ఇక్కడ కబ్జాకు పాల్పడడంతో అధికారులకు ఫిర్యాదు చేయడంతో కబ్జాకు గురైన భూమిని పనులు ఆపించారన్నారు. కానీ సదరు వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సర్పంచ్ పదవికాలం ముగిసిన రెండు రోజులకే ఈ భూమి కబ్జాకు పాల్పడుతున్నాడని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, అధికారుల అండతోనే ఈ కబ్జాకు పాల్పడుతున్నట్టు అర్థం అవుతుందన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌కు విన్నవించడం జరిగిందన్నారు. అధికారులు ఇప్పటికైన నిర్మాణాలను ఆపేసి సదురు వ్యక్తిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

కబడ్డీ విజేతగా వెల్గి జట్టు



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పోచయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన స్మారక కబడ్డీ పోటీల్లో వెల్గి గ్రామం జట్టు విజేయం సాధించింది. విజేతగా నిలిచిన వెల్గి జట్టుకు జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎస్సై సాగర్ రూ.10001 వేల నగదును అందజేశారు. ద్వితీయ బహుమతి భజరంగ్‌బలీ(సోనాపూర్) జట్టుకు రూ.5001 వేలు, తృతీయ బహుమతి చిన్నపాటగూడ జట్టుకు రూ.3001 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నతస్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు శనివారం వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నందను కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాకు వచ్చిన ఆమె ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు న్యాయమూర్తిని కలిసి పుష్పగుచ్చాలు అందించారు.

టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న 10వ తరగతి టాలెంట్ టెస్టును సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. శనివారం టాలెంట్ టెస్ట్ కరపత్రాలను డీఎస్పీ ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ కంటే ముందే టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లోని భయాన్ని పోగొట్టి వారిలో ఉన్న ప్రతిభని వెలికి తీసేందుకు ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో టెస్టు నిర్వహిస్తామని, పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో 10 ర్యాంకులకు, ప్రతీ మండలానికి 3 ర్యాంకులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్ 8886561367, 9381046472 సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చాపిలే సాయికృష్ణ, జె.రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు వి.సాయికుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నితీష్ పాల్గొన్నారు

ఒత్తిడి లేకుండా పది పరీక్షలు రాయాలి

- గురుకులం ప్రత్యేక అధికారి ఏకాంబరం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఎలావంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని గురుకులం ప్రత్యేక అధికారి ఏకాంబరం అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులతో పది పరీక్షలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఒత్తిడికి లోను కావద్దన్నారు. ప్రశ్న పత్రం చూడగానే మొదట వచ్చిన వాటికి సమాధానం రాయాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పరీక్షల పట్ల వారికి ఉన్న బయాన్ని పోగొట్టాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళులు అనిత, సురేష్, శారద, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

దక్షిణ భారత స్థాయిలో తృతీయ బహుమతి అభినందనీయం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

దక్షిణ భారత స్థాయిలో తృతీయ బహుమతి కాగజ్‌నగర్‌కు రావడం అభినందనీయమని డీఈవో పార్సి అశోక్ అన్నారు. విజయవాడలో నిర్వహించిన దక్షిణ భారత స్థాయి రాజ్య బాల వైజ్ఞానిక ప్రదర్శనలో కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మామిడాల తిరుపతయ్య బోధనోపకరణాల విభాగంలో దక్షిణ భారత స్థాయి బహుమతి సాధించారు. శనివారం సర్సిల్క్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తిరుపతయ్యను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు వినూత్నంగా బోధనా పద్ధతులు చేపట్టినప్పుడే విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అబీద్ అలీ, పెట్రోల్ పంప్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకట్రాజ్యం పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ భోజన్నను శనివారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, ముత్యంపల్లి అధ్యక్షులు దారవేణి రాజయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి రేషవేణి ఓదెలు, యూత్ అధ్యక్షులు మారం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

చెకుముకి రాష్ట్ర స్థాయికి కిష్టాపూర్ విద్యార్థులు

నవతెలంగాణ-జన్నారం



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులు విష్ణువర్ధన్, అరవింద్, అక్షయతో పాటు గైడ్ టీచర్‌లు కొట్టే రాజన్న, బుచ్చి లింగయ్యలను ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న అభినందించారు. ఇన్స్‌పైర్ మనాక్‌లో రాష్ట్ర స్థాయికి కిష్టాపూర్ హైస్కూల్ ప్రదర్శన ఎంపికైందన్నారు. పాఠశాల 10వ తరగతి విద్యార్థి తేజావత్ విజయ్ కుమార్ తన స్టూడెంట్ ఫ్రెండ్లీ క్యారెజ్ ఫర్ బైస్కిల్ ప్రదర్శనతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

నిర్మాణం సరే.. నాణ్యతేదీ?

- అనతి కాలంలోనే పగుళ్లు
- కరకట్ట కట్టడంతో పాటు మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్



ఇందారం-రామారావుపేట్ మధ్య నిర్మించిన రోడ్డు(ఫైల్)



ఉగ్రిపోతున్న సపోర్టు రోడ్డు

నవతెలంగాణ-జైపూర్

ఉపకారానికి ప్రత్యుపకారం అన్నచందంగా... సింగరేణి యాజమాన్యం ఇందారం-రామారావుపేట్ మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టింది. సింగాపూర్ మీదుగా రామారావుపేట్ నుండి నస్పూర్ వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డును ఓపన్‌కాస్ట్ గని విస్తరణ కోసం స్వాధీనం చేసుకుంది. ఇక్కడ రోడ్డును స్వాధీనం చేసుకున్నందుకు బదులుగా రామారావుపేట్-ఇందారం మధ్య చెరువు కట్ట మీదుగా ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించింది. రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ఎంతో కాలం కాలేదు.. నెలల వ్యవధితోనే రోడ్డు పగుళ్లు తేలి కన్పిస్తోంది. చెరువు కట్ట మీదుగా నిర్మించిన రోడ్డుకు ఒక వైపు చెరువు నీళ్లు మరో వైపు పంట పొలాలు. పంట పొలాల వైపు గల మట్టి రోడ్డు రోడ్డు (ఉగ్రిపోతుంది) కొట్టుకుపోతుంది. బీటీ రోడ్డుకు సపోర్టుగా రెండవ వైపు నిర్మించిన మట్టి రోడ్డు క్రమక్రమంగా ఉగ్రిపోతూ బీటీ రోడ్డును చేరుకుంటుంది. సపోర్టు రోడ్డును పటిష్టంగా నిర్మించకపోగా కింది నుండి మీది వరకు కరకట్ట కట్టాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తించకపోవడం ఈ పరిస్థితికి దారి తీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా రోడ్డు నిర్మాణంలో ఆర్భాటం ప్రదర్శించిన సింగరేణి అధికారులు రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు కూడా వస్తున్నాయి. రూ. 2.8 కోట్లతో నిర్మించిన ఈ రోడ్డు పది కాలాల పాటు పటిష్టంగా ఉండాలని నిర్మించకుండా ఉపకారానికి ప్రత్యుపకారం అన్నట్లుగా సింగరేణి అధికారులు రోడ్డు నిర్మించి చేతులు దులుపుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రోడ్డు పటిష్టంగా నిర్మించాలి

మాజీ సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి

చెరువు కట్ట మీదుగా నిర్మించిన రోడ్డు రెండవ వైపు కరకట్ట కట్టడంతో పాటు కింది నుండి మీది వరకు పటిష్టమైన సపోర్టు నిర్మించాలి. రామారావుపేట్ నుండి సింగాపూర్ మీదుగా ఉన్న రోడ్డును స్వాధీనపర్చుకున్న సింగరేణి యాజమాన్యం స్థానికుల డిమాండ్ మేరకు ఇందారం-రామారావుపేట్ మధ్య రోడ్డు విస్తరించినా సింగరేణి అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై నాణ్యతను పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగించారు. ఇప్పటికైనా సపోర్టు రోడ్డు నిర్మించడంతో పాటు విస్తరించిన రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలి.

విలువైన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద



కలెక్టర్‌ను సన్మానిస్తున్న హైకోర్టు జడ్జీ సూరెపల్లి నంద

నవతెలంగాణ-నస్పూర్

ఆరోగ్యం విలువైన సంపదని, దీన్ని కాపాడుకోవడానికి ఆరోగ్య సూత్రలు పాటించాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మెగ వైద్య శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా నస్పూర్ సింగరేణి అతిథి గృహంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకస్, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో దియాలిబాయ్ లాల్చంద్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మెన్ దయానంద్ గౌరి, మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్, రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ స్మార్ట్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టుల యూనిట్, కలెక్టరేట్ సిబ్బంది, న్యాయవాదులు, ప్రజల ప్రయోజనం కోసం మధుమేహం, ఈఎన్‌టి, దంత పరీక్షలు, క్యాన్సర్, కార్డియాక్ స్క్రీనింగ్, అవగాహనపై నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ మానవ జీవితంలో ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని, ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకొని సంతోషంగా జీవించాలన్నారు. జిల్లాలో మెగా వైద్య శిబిరం, మెగా న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి చెందిన వైద్యుల బృందం బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ పరీక్షలు, ఈసీజీ, 2డి ఈకో పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ శిబిరంలో దాదాపు 650 మంది న్యాయవాదులు, ప్రభుత్వ శాఖల సిబ్బంది ప్రయోజనం పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు సిహెచ్. సంపత్, డి. ఉపనిషద్విని, అలదుల్లా షరీఫ్, జె. ముఖేష్, టి.రవి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా. జి.సి. సుబ్బారాయుడు, దియాలిబాయ్ లాలచంద్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం

న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ద్వారా చట్టపరమైన సేవలు అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద అన్నారు. శనివారం జిల్లా న్యాయస్థానంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ హాలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందరికీ చట్ట పరమైన సేవలు అందించడం జరుగుతుందని, పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. న్యాయ సేవల కోసం స్థానిక భాష, ఇంగ్లీష్‌లో దరఖాస్తు సమర్పించవచ్చని, పారాలీగల్ వాలంటీర్లు, లీగల్ ఎయిడ్, లీగల్ ఎయిడ్ క్లినిక్లు, స్వచ్ఛంద సామాజిక సేవా సంస్థలతో సలహా పొందిన దరఖాస్తుదారు కూడా ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని తెలిపారు. తాలుకా, జిల్లా, రాష్ట్ర స్థాయిలో న్యాయ సేవల సంస్థ ద్వారా ఏర్పాటు చేయబడిన న్యాయ సేవల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు కమిటీ ఉంటుందని, దరఖాస్తు అందిన తేదీ నుండి 8 వారాల వ్యవధిలో దరఖాస్తుదారుడు న్యాయ సేవలకు అర్హుడ కాదా నిర్ణయిస్తుందన్నారు. ప్రతి న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ లాయర్లుగా లీగల్ ప్రాక్టీషనర్ల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో నూతన భవన నిర్మాణం, అదనపు కోర్టుల మంజూరు అంశాలపై చీఫ్ జస్టిస్‌కు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జూనియర్ సివిల్ న్యాయమూర్తులు సిహెచ్. సంపత్, డి.ఉపనిషద్విని, అలదుల్లా షరీఫ్, జె. ముఖేష్, టి.రవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య, కె. సురేందర్, పి.మల్లేష్ గౌడ్, సిహెచ్. మనోహర్ పాల్గొన్నారు.


నైపుణ్యాలను వెలికి తీయడానికే టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి టాలెంట్ టెస్టు ఎంతగానో ఉపయోగపడుతాయని డీఈఓ యాదయ్య అన్నారు. శనివారం తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరమ్(టీఎస్ఎస్టీఎఫ్) ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థ సౌజన్యంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు మంచిర్యాలలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 64 పాఠశాలల నుండి 180 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌కి హాజరయ్యారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలు దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను పరీక్షలను సిద్ధం చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఈ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. విజేతలకు జిల్లా విద్యాధికారి యాదయ్య బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ పిల్లలు పరీక్షలకు సిద్ధం చేయడం కోసం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఈ విధంగా పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ టెస్ట్‌లో తెలుగు మీడియంలో జే.సంధ్యారాణి (కేజీబీవీ, కోటపల్లి), సిహెచ్ లత (జెడ్పీహెచ్ఎస్, కలమడుగు), జి. నాగజ్యోతి (కేజీబీవీ, బెల్లంపల్లి), ఇంగ్లీష్ మీడియంలో డి. అభినయ్ (జడ్పీహెచ్ఎస్, వెల్గనూర్), శివ నందిని (జడ్పీహెచ్ఎస్ గర్ల్స్, మంచిర్యాల), జశ్వంత్ (జడ్పీహెచ్ఎస్ బజార్ ఏరియా) బహుమతులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జాడి పోచయ్య, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ మూర్తి, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, మంచిర్యాల జిల్లా సోషల్ స్టడీస్ ఫోరం జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు, ప్రధాన కార్యదర్శి ఇప్పలపల్లి మహేష్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చక్రధర్ రావు, గురువయ్య, హరినాథ్, భుక్య రాజన్న, తులా మధుకర్, అంకం రమేష్ ,బండి రమేష్, మనుబోతుల రాజన్న, నరసింహులు, గోవర్ధన్ చారి, సుగుణ, సుజాత పాల్గొన్నారు.

భగీరథ నీరు వచ్చేదెన్నడో..?



కొనసాగుతున్న మరమ్మతుల పనులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో మిషన్ భగీరథ నీరు రెండు వారాలుగా నిలిచిపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకంలో ఏర్పాటుచేసిన పైప్‌లైన్ క్యాతనపల్లి ఆర్‌ఓబి ఫ్లై ఓవర్ పనుల కారణంగా పగిలిపోయింది. పైప్‌లైన్ పగిలిపోయి రెండు వారాలు గడుస్తున్న సంబంధిత అధికారులు మాత్రం మరమ్మత్తులు చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. దీంతో రామకృష్ణాపూర్‌తో పాటు మందమర్రి మండలంలోని పలు గ్రామాలకు నీరు అందడం లేదు. ప్రజలు బోరింగు, బావులుపై ఆధారపడాల్సి వస్తుంది. తాగునీటి సమస్య ఏర్పడటంతో ప్రజలకు ఆరోగ్యానికి హాని చేసే అనుమతులు లేని మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద కొనుగోలు చేసుకునే దుస్థితి నెలకొంది. వేసవి కాలం సమీపిస్తున్న వేళ ఇటువంటి సమస్యలపై శ్రద్ధ చూపాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై వాటర్ గ్రిడ్ అధికారి ఏఈ వినయ్‌ను వివరణ కోరగా పనులు కొనసాగుతున్నాయని, మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఈ వ్యవహారంలో ఆర్‌ఓబి, మిషన్ భగీరథ అధికారుల మధ్య ఆర్థికమైన సమస్యలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

మాదారంలో వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం




నవతెలంగాణ-తాండూర్

మండలంలోని మాదారం సింగరేణి సేవా సమితి భవనంలో శనివారం ఉచిత బ్యూటీషియన్, మగ్గం శిక్షణ తరగతులను బెల్లంపల్లి ఏరియా సేవ సమితి ఉపా ధ్యక్షురాలు ఎం.నళిని నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి సేవ సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత వృత్తి శిక్షణ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు జూట్ బ్యాగులు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్ శిక్షణాలు ఉపయోగపడుతాయన్నారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా కుటుంబానికి బాసటగా నిలవాలని కోరారు. గౌరవ అతిథిగా హాజరైన ఎస్ఓ టూ జీఎం మచ్చగిరి నరేందర్ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థిక భరోస కలిగేల ఎదగాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను సింగరేణి సంస్థ ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ సేవ సభ్యులు కోమల, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ప్రశాంత్, కొండ అంజయ్య పాల్గొన్నారు.

గని రక్షణపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిపై శనివారం రక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేఫ్టీ రీజియన్ జీఎం కేహెచ్ఎన్ గుప్తా హాజరై సింగరేణి సంస్థలో గత సంవత్సరం జరిగిన ప్రమాదాలు, దానికి గల కారణాలు, నివారణ మార్గాలను వివరించారు. ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు రక్షణ విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రామదాసు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్ కుమార్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీ నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



నేడు రైతు అవగాహనా సదస్సు



నవతెలంగాణ-హాజీపూర్

రైతు ఉత్పత్తిదారుల సంస్థ, ఉమ్మడి జిల్లా నాబార్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో రైతు అవగాహన సదస్సుతో పాటు ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమీకృత వ్యవసాయం, మిద్దె సాగు, పెరటి కూరగాయల పెంపకం, పాడి, గొర్రెల పెంపకం, సేంద్రీయ వ్యవసాయంపై నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొని సాగులో అధిక దిగుబడులు సాధించే సలహాలు, సూచనలు ఇవ్వవనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేంద్రీయ వ్యవసాయ దారులు, ఎఫ్‌పీసీ మెంబర్లు గోనె శ్యాంసుందర్ రావు, పుస్కూరి శ్రీనివాస్ రావు, వినయ్ ప్రకాష్ రావు, బొడ్డు శంకర్ పాల్గొన్నారు.

సమ్మక్క జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలి

నవతెలంగాణ-హాజీపూర్

సమ్మక్క జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అధికారులను ఆదేశించారు. శనివారం మంచిర్యాల గోదావరి తీరంలో ఈనెలలో జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతర సౌకర్యాల ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిలించారు. అధికారులతో కలిసి జాతర పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. జాతర నిర్వాహణకు కోరిన వెంటనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రూ.కోటి నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆ నిధులతో మంచిర్యాల, నస్పూర్‌లో జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. స్నానాల గదులు, తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జాతరతో పాటు శివరాత్రికి పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు కూడా సౌకర్యాలు కల్పించాలన్నారు.



హాజీపూర్: గోదావరి తీరంలో జాతర పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



నస్పూర్: జాతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

నస్పూర్ : నస్పూర్‌లోని ముక్కిడి పోచమ్మ దేవాలయం వద్ద నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర స్థలాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రేమ సాగర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. భక్తులకుఎ లాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల పర్యవేక్షణలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



నవతెలంగాణ-తాండూర్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి సాగర్ డిమాండ్ చేశారు.శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీని కారణంగా విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. మోడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులరైజేషన్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ప్రకటించాలని, ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు వంశీ, బిందు, గీత, సాగరిక, శ్రీకాంత్, సాగర్, స్రవంతి, లడ్డు పాల్గొన్నారు

జీపీ కార్మికుల సేవలు వెలకట్టలేనివి

నవతెలంగాణ-జైపూర్

గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్మికుల అందించిన సేవలు వెలకట్టలేమని శివ్వారం మాజీ సర్పంచ్ ఆవిడపు గణేష్ అన్నారు. ఐదేళ్ల పదవి కాలం పూర్తిచేసుకుని పదవీ విరమణ పొందిన ఆయన శనివారం జీపీ ఆవరణలో గ్రామపంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించి మంచి పేరు సాధించారన్నారు. ఐదేండ్ల పదవీకాలంలో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనుల నిర్వహణకు సహకరించిన పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి గ్రామ పెద్దలు తదితరులు తనకు సంపూర్ణంగా సహకరించారని గుర్తు చేసుకున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి కొనసాగాలంటే సర్పంచ్ సహా పాలకవర్గం కలివిడిగా ఒకరికొకరు సహకరించినప్పుడే సాధ్యమవుతుందన్నారు. అనంతరం సర్పంచ్ ఆవిడపు గణేష్ దంపతులను పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా నియమితులైన వ్యవసాయ అధికారికి పాలకవర్గం సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్నందుకు ఆర్ఐ సునీతను మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఇలాంటి సేవలు మరిన్ని ప్రజలకు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ మల్లెపూల సుభాష్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ రమణగౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు బీమా బుచ్చన్న, సీనియర్ నాయకులు నారాయణ, దేవిదాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన జడ్పీ చైర్మన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జెడ్పి చైర్మన్ జనార్దన్ రాథోడ్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర బిజెపి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి సమక్షంలో కమలం కండువా కప్పుకున్నారు. నార్నూర్ మండలం నుండి బీఆర్ఎస్ జెడ్పిటిసిగా గెలుపొంది జడ్పీ చైర్మన్ అయ్యారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయగా కాంగ్రెస్‌లో చేరుతారన్న ఊహగానాలు వినిపించాయి. అయితే ఎట్టకేలకు బీజేపీలో చేరారు.



విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-తలమడుగు

విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని మహిళ సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. శనివారం మండలంలోని భరంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళ సాధికారత, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నేటి సమాజంలో బాలలహక్కులు ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల, గుడ్ టచ్ బాడ్ టచ్, లింగ వివక్షత, లింగ సమానత్వం మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తూ, భేటీ బచావో బేటి పడావో పథకం ముఖ్య ఉద్యేశాన్ని తెలిపారు. బాలికలను రక్షించాలి, చదివించాలి బాలికల పట్ల వివక్ష ఉండకూడదని అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. సరస్వతి సఖీ నిర్వాహకులు సఖీ కేంద్రం సేవల గూర్చి వివిధ అంశాలపై హెల్ప్ లైన్ నెంబర్స్, లీగల్ కౌన్సిలర్ మంజుల గృహ హింస చట్టం, వరకట్న నిషేధం చట్టం గురించి నాగమణి కేస్ వర్కర్ సామాజిక స్పందన, హెల్ప్‌లైన్‌లను అత్యవసర సమయంలో ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై విద్యార్థినులకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షలపై అవగాహన



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కౌట-బి గ్రామ స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో శనివారం కనుగుట్ట, పొచ్చెర, కౌట-బి ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్ గొడిసెల పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండడానికి పాటించాల్సిన నియమాలను వివరించారు. అలాగే పరీక్షలకు ముందున్న సమయాన్ని విద్యార్థులు ఏవిధంగా వినియోగించుకోవాలి, ఎలా చదివితే ఎక్కువ మార్కులు సంపాదించవచ్చు, చదివే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే పరీక్ష హాల్‌లో పాటించాల్సిన నియమాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌట-బి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు గంగాధర్, వివేకానంద యూత్ సభ్యులు పాల్గొన్నారు.


ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు పాటించాలి



నవతెలంగాణ-బోథ్

ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమావళిని పాటించాలని ఎస్సై రాము అన్నారు. శనివారం జాతీయ రహదారుల భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాము మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలన్నారు. అలాగే సీటు బెల్టు దరించాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు. పరిమితికి మించి వాహనాలలో ప్రజలను రవాణ చేయకూడదని అన్నారు. అదేవిధంగా చిన్నారులకు వాహనాల ఇవ్వకూడదని, మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రబీంద్రలో లీడ్ ఇండియా కార్యక్రమం



ముథోల్ : మండల కేంద్రంలోని రబింద్రా ఉన్నత పాఠశాలలో శనివారం లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాతావరణ కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు, చదువుపై ఏకగ్రత తదితర అంశాలు దేశం ఔన్నత్యం, అమ్మానాన్న, గురువుల ప్రాధాన్యతలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, శ్రీనివాస్ ఆచార్య, తిరుపతి, ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, చైర్మెన్ భీంరావ్ దేశ్‌ముఖ్, డైరెక్టర్ పోతన్న యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గిరిజనులను తీవ్ర నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

- పెద్దలకు పెట్టి పేదలకు మొండిచేయి
- టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్



మాట్లాడుతున్న పూసం సచిన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024 - 25 బడ్జెట్లో గిరిజనులకు కేవలం రూ.13వేల కోట్లు మాత్రమే కేటాయించి తీవ్ర నిరాశపరిచిందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో గిరిజనుల అభివృద్ధికి నూతన పథకాలను ప్రవేశపెట్టి వాటికి ప్రత్యేక నిధులు కేటాయించి ఖర్చు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గిరిజనులకు కేటాయించిన నిధులను సైతం ఖర్చు చేయలేని అసమర్ధ ప్రభుత్వమని తెలిపారు. 2022-23 బడ్జెట్లో రూ.8451 కోట్లు కేటాయించి రూ.7273 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన రూ.1178 కోట్లు దారి మళ్లించిందని అన్నారు. 2023-24 బడ్జెట్‌లో రూ.12461 కోట్లు కేటాయించి సవరించిన అంచనాల్లో రూ.7605కోట్లకు తగ్గించి గిరిజనులను దగా చేసిందని విమర్శించారు. 2024-25 ప్రస్తుత బడ్జెట్లో కేవలం రూ.13వేల కోట్లు మాత్రమే కేటాయించి దేశంలో ఉన్న 15 కోట్ల మంది గిరిజనులను ఎలా అభివృద్ధి చేస్తారో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు న్యాయంగా రావలసిన ఆర్టికల్ 275 ప్రకారం కేటాయించాల్సిన నిధులను సైతం తగ్గించడం అన్యాయమని అన్నారు. 2022-23 బడ్జెట్లో ప్రధానమంత్రి పీవీటీజీల అభివృద్ధి మిషన్ పేరుతో కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన రూ.15వేల కోట్లు, షెడ్యూల్ ట్రైబ్ అభివృద్ధి యాక్షన్ ప్లాన్ పేరిట మరో లక్షా17వేల కోట్లు గత రెండు సంవత్సరాలుగా ఖర్చు చేయకపోవడం గిరిజనుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని అన్నారు. దేశంలో ఒకవైపు గిరిజనుల్లో ఆకలి దారిద్రం గతం కంటే గణనీయంగా పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి సైతం ఆందోళన వ్యక్తం చేసినా అధిగమించేందుకు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ఆందోళన కలిగించే అంశమని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ఆవాసాల్లో మౌలిక సదుపాయాల కల్పన, గిరిజనుల విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో నిధులను పెంచకపోగా గతం కంటే తగ్గించడం గిరిజనులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారిన కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడం ద్వారానే గిరిజనులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు మడావి నాగోరావ్, కనక మలకు, అర్జున్, మెస్రం మహేష్ పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్లు, డీఈఓ

నవతెలంగాణ-నిర్మల్

పదో తరగతి ఫలితాల్లో గతంలో లాగా జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్‌లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు, మండల విద్యాధికారులతో పదో తరగతి పరీక్షల నిర్వహణ, సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్మల్ జిల్లా గత సంవత్సరం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు అందరినీ అభినందించారు. అదేవిధంగా ఈ సంవత్సరం అదే స్పూర్తితో జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని, అందుకు అందరూ బాధ్యతతో కృషి చేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధనకు ఏర్పరచిన 45 రోజుల ప్రత్యేక ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఒక్కొక్క యాజమాన్యాల వారీగా రెసిడెన్సియల్, సోషల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్, ఆశ్రమ, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీ, జిల్లా పరిషత్, ప్రయివేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గత సంవత్సర ఫలితాలు, 10కి 10 జీపీఏ సాధించిన వారి వివరాలు, ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన వివరాలు, మెరుగైన ఫలితాల సాధనకు వారు అమలు చేస్తున్న విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ పూర్తి ప్రయత్నంతో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులు అయ్యేలా చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిని విషయాల వారీగా పర్యవేక్షించాలన్నారు. ఉపాధ్యాయులు, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారు ఉత్తీర్ణులయ్యే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను అవలంబించాలన్నారు. ప్రతి రోజు స్లిప్ టెస్ట్ నిర్వహించాలని, వాటిని మూల్యాంకనం చేసి, విద్యార్థుల వెనుకబాటును గుర్తించి, తగిన అభ్యాసాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా గణితం, ఆంగ్లము విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పరచి, విద్యార్థులు పాఠశాలకు వంద శాతం హాజరయ్యేలా, ఇంటి వద్ద చదివేలా వారికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అత్యవసరమైతే తప్ప సెలవు పెట్టరాదని సూచించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు మండల విద్యాధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రగతి వివరాలను రోజు వారీగా తమకు తెలియజేయాలని ఆదేశించారు. డీఈఓ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం మొత్తం 8,923 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాల సాధనకు 45 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటు చేశామని, దాని ప్రకారం ప్రతిరోజు విషయాల వారీగా స్లిప్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 5 వ తేది నుంచి 12 వ తేది వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నామని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు గోపీచంద్, రాజేశ్వర్‌గౌడ్, అంబాజి, గంగాధర్, సెక్టోరల్ అధికారులు నర్సయ్య, శ్రీదేవి, ప్రవీణ్ కుమార్, లింబాద్రి, మండల విద్యాధికారులు శంకర్, సుభాష్, మైసాజీ, మధుసూధన్, చంద్రకాంత్, ముత్యం, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పున : సమీక్షించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు నష్టం చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ మోదీ ప్రభుత్వం వెంటనే బడ్జెట్‌ను పున : సమీక్షించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2024-25 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ గత ఆర్థిక సంవత్సర బడ్జెట్ కంటే తక్కువగా ఉందని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించడానికి అది ఎంత మాత్రం దోహదపడదని ఆక్షేపించారు. పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ, అనేక రాయితీలను కల్పించిన మోదీ ప్రభుత్వం పేదల రంగాలకు మాత్రం మొండి చేయి చూపించిందని దుయ్యబట్టారు. వారి సుదీర్ఘ పాలనలో ధనవంతులు ఇంకా ధనవంతులుగాను పేదలు మరింత నిరుపేదలుగా మారారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం బడా బాబుల ప్రభుత్వమని మరోసారి రుజువైందని అన్నారు. కేంద్రం కేటాయింపులు సరిగ్గా లేవని ఆరోపించిన ఆయన బడ్జెట్ పూర్తిగా నిరాశపరిచిందని అసహనం వ్యక్తం చేశారు. సబ్సిడీల తగ్గింపు వల్ల అనేక రంగాలు దెబ్బతింటాయని, ప్రజా పంపిణీకి సరైన బడ్జెట్‌ను కేటాయించలేదని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ, ఉపాధి హామీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగేలా బడ్జెట్‌ను రూపొందించారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వెంటనే పున : సమీక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెల్ల స్వామి, సహాయ కార్యదర్శి కే.ఆశన్న, ఉపాధ్యక్షులు ఏ.పొచ్చక్క, జిల్లా నాయకులు ఎం.శంకర్, రాజక్క, ఎం.గంగారాం పాల్గొన్నారు.

జిల్లా కోర్టు అభివృద్ధికి కృషి

- హైకోర్టు జడ్జి సూరెపెల్లి నంద



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కోర్టు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హైకోర్టు న్యాయమూర్తి సూరెపెల్లి నంద హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆమెకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవి.రమేష్, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్, జ్యుడీషియల్ ఆఫీసర్ అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ జిల్లాకు అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా ఉన్న తాను జిల్లా పర్యటనకు రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కోర్టులో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అంతకు ముందు పలువురు మాట్లాడుతూ చెప్పిన సమస్యల పట్ల స్పందిస్తూ జిల్లా కోర్టు ఆవరణలో 10 కోర్టుల భవనానికి శంకుస్థాపన చేసే విధంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రభుత్వంతో మాట్లాడతానని, సిర్పూర్ కేంద్రంలో రెండు అదనపు కోర్టుల ఏర్పాటు కోసం, జిల్లా కేంద్రంలో అట్రాసిటీ, వినియోగదారుల ఫోరంల ఏర్పాటు కోసం కృషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రానికి రావడానికి ఇచ్చిన ఆహ్వానాన్ని మర్చిపోలేనని జిల్లాలోని అడ్వకేట్లు వివిధ ప్రముఖులు చూపుతున్న ఆదరాభిమానాలు ఎంతో బాగున్నాయని కితాబుఇచ్చారు. అంతకు ముందు జిల్లా జడ్జి ఎంవి రమేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఫోక్సో కోర్టు ప్రారంభానికి బార్ అసోసియేషన్ సభ్యులు తన భవనాన్ని ఇవ్వడం వారి త్యాగానికి నిదర్శనం అన్నారు. తాను ఎప్పుడు ఒక విద్యార్థిగా ఉంటానని, ప్రతి కేసు ఒక పరీక్షగా స్వీకరించి ఉత్తమ ఫలితం కోసం ప్రయత్నం చేస్తానని తెలిపారు. జిల్లా కేంద్రంలో 10 కోర్టుల కాంప్లెక్స్ తన హయాంలో శంకుస్థాపన కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాకు తూర్పు ప్రాంతం చాలా దూరంగా ఉందని జిల్లా కేంద్రంలో అట్రాసిటీ, వినియోగదారుల ఫోరంలు ఏర్పాటు చేయాలని కోరారు. అడ్వకేట్ రాపర్తి రవి ఆసిఫాబాద్ కోర్టు చరిత్ర, గొప్పతనాన్ని వివరించారు. అనంతరం 40 సంవత్సరాల నుండి ప్రాక్టీస్‌లో ఉన్న సీనియర్ అడ్వకేట్లను హైకోర్టు జడ్జి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యుడు ఫణీంద్ర భార్గవ్, సీనియర్ అడ్వకేట్లు శంభు ఆమ్టే, కిషోర్, అడ్వకేట్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి

- డీఎల్ఎస్ఏ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్



నవతెలంగాణ-తలమడుగు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, డీఎల్ఎస్ఏ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కజ్జర్ల గ్రామంలోని రైతు వేదికలో క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎల్ఎస్ఏ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ హజరై మాట్లాడారు. రోజురోజుకు పెరిగిపోతున్న క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఏ వ్యాధి వచ్చిన నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్లను సంప్రదించి మొదటగా వైద్య పరీక్షలు నిర్వహించుకొని, రోగాన్ని నిర్ధారించుకోవాలన్నారు. నేటి సమాజంలోని మనుషులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, ఏది మంచి ఏది చెడో తెలుసుకొని నడవాలన్నారు. క్యాన్సర్ డే దినోత్సవం రోజున 9 మంది క్యాన్సర్ రోగులు వైద్య శిబి రానికి రావడం బాధాకరమన్నారు. ఏ రోగమైన తొలి దశలోని రోగాన్ని గుర్తించి వైద్యం చేయించుకోవాలని ప్రజలను కోరారు. ఆరోగ్యకరంగా ఉండాలంటే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ పి.శివరాం ప్రసాద్, న్యాయమూర్తి క్షమాదేశ్‌పాండే, అభివృద్ధి అధికారి రమకాంత్, గైనకాలజిస్ట్, ఫిజీషియన్, సర్జరీ, పారామెడికల్ వైద్య సిబ్బంది రోగులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సౌజన్యంతో పదవ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్షను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా రవాణా అధికారి గందం లక్ష్మి, స్థానిక సిఐ రాజు, జిల్లా ఇన్చార్జి విద్యాధికారి ఉదయబాబు, ఎంపీపీ మల్లిఖార్జున్, ఎంఈవో మనుకుమార్, సెక్టోరల్ అధికారులు భరత్, శ్రీనివాస్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నిర్వహణ కమిటీ అధ్యక్షులు జి రవిశంకర్, ప్రధాన కార్యదర్శి లాలాజీ మాట్లాడుతూ వివిధ పాఠశాలల నుంచి మొదటి, రెండు, మూడో బహుమతులను మీడియాల వారీగా అందివ్వడం జరిగిందని, వీరు హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవా పరీక్షకు హాజరు కావలసి ఉంటుందని తెలియజేశారు.

టాలెంట్ టెస్ట్‌లో విజేతలు

ఇంగ్లీష్ మీడియం ప్రథమ బహుమతి ఆదర్శ పాఠశాల విద్యార్థి జస్వంత్, ద్వితీయ బహుమతి వేదక్షర, తృతీయ బహుమతి ఆసిఫాబాద్ కెజిబివికి చెందిన గంగభవాని, ప్రత్యేక ప్రోత్సహక బహుమతి ఆదర్శ పాఠశాల మనస్విని పొందారు. తెలుగు మీడియం నుండి ప్రథమ బహుమతి జెడ్పిఎస్ఎస్ వాంకిడి స్వప్న, ద్వితీయ బహుమతి జెడ్పిఎస్ఎస్ తిర్యాణి రవితేజ, తృతీయ బహుమతి జెడ్పిఎస్ఎస్ లోనవెల్లి చెందిన రాహుల్ పొందారు.

మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

బోథ్: మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బి.హుస్సేన్ అన్నారు. శనివారం బోథ్ కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో సాధ్యమైనంత ఎక్కువ క్రిమినల్, ఎస్ టిసి చలన కేసులు పరిష్కారం అయ్యేటు చోరవ చూపాలని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో పిపి శ్రీధర్ , సి ఐ బీమేష్, ఎస్ఐ రాము, ఇచ్చోడా నేరేడిగొండ బజార్ హత్నూర్ గుడిహత్నూర్ సిరికొండ మండలా ల ఎస్ఐ లు కోర్టు పిసిలు పాల్గొన్నారు.